సందడిగా సంక్రాంతి సంబరాలు



స్టీల్‌ప్లాంట్ డీపీఎస్ వేడుకల్లో విద్యార్థులతో సీఎండీ అతుల్ భట్ దంపతులు



చలపతి స్కూల్‌లో భోగి మంటల సందడి



గిరీష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు



కణితి జెడ్పీ హైస్కూల్లో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

ఇంద్రధనస్సు ఇల చేరినట్లుగా రంగుల రంగవల్లికలు.. భగభగలాడే భోగిమంటలు.. రివ్వున ఎగిరే గాలిపటాలు.. డూ డూ బసవన్నల విన్యాసాలు.. కొత్త బియ్యంతో తయారుచేసిన పొంగలి.. చూడచక్కగా బొమ్మల కొలువులు.. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు, యువతులు.. ఇలా.. విద్యాసంస్థలన్నీ పండగ శోభతో కళకళలాడాయి. ఆవరణలన్నీ పల్లె ముంగిళ్లను తలపించగా.. విద్యార్థులంతా తెలుగుదనం ఉట్టిపడేలా అగుపించారు. గాజువాక నియోజకవర్గంలోని రవీంద్రభారతి స్కూల్, సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇండియన్ స్కూల్, ఎంవీఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, చైతన్యనగర్‌లోని విద్యా వికాస్ జూనియర్ కళాశాల, చలపతి, ట్వింకిల్ స్కూల్స్, స్టీల్‌ప్లాంట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాంధీనగర్‌లోని గిరిష్ విద్యా నికేతన్‌లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వక్తలు పేర్కొన్నారు.

– గాజువాక/ఉక్కునగరం/కూర్మన్నపాలెం/పెదగంట్యాడ



ఎంవీఆర్ కళాశాలలో గంగిరెద్దు విన్యాసం



విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



సంక్రాంతి సంబరాల్లో వివిధ వేషధారణల్లో చిన్నారుల సందడి



రవీంద్ర ఇండియన్ స్కూల్‌లో సంబరాల్లో పాల్గొన్న దేవన్‌రెడ్డి, రామారావు



రవీంద్ర భారతి స్కూల్‌లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినీ విద్యార్థులు

క్లుప్తంగా

74వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ



మహిళకు ఇంటిపట్టా అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 74వ వార్డు టీబీసీ పాయింట్ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి బుధవారం రెండో విడత పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. ఆ సత్సంకల్పాన్ని సాకారం చేస్తూ పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్వై నాయుడు, తిరుపతి, దుర్గారావు, నర్సీపట్నం నాయుడు, రవి, ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

కలాసీలకు దుస్తుల పంపిణీ



కలాసీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దేవన్‌రెడ్డి, మంగరాజు

పెదగంట్యాడ: పెదగంట్యాడ వర్తక సంఘం సభ్యుడు కులుకూరి మంగరాజు ఆధ్వర్యంలో జంక్షన్‌లోని 50 మంది కలాసీలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిప్పల నితీష్‌రెడ్డి, పి.ఆనందరావు, ఎన్.సత్యనారాయణ,సూర్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రామారావు

గాజువాక : హర్యానాలో త్వరలో నిర్వహించనున్న ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయాల నెట్‌బాల్ పోటీలకు స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వారు ఆంధ్రా యూనివర్సిటీ తరఫున ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ఏయూ అంతర్ కళాశాలల పోటీల్లో ఎంవీఆర్ కళాశాలకు చెందిన పి.శివపునీత్, జీవన్ కుమార్ ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎంపిక చేసినట్టు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

పెదగంట్యాడ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతి చెందారు. న్యూపోర్టు సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బీసీ రోడ్డు టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతూ రోడ్డుపై పడిపోయాడు. గమనించిన ఓ వ్యక్తి వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడికి చేరుకుని న్యూపోర్టు పోలీసులకు తెలియజేశారు. ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. ఆ వ్యక్తి పేరు ఇ.గంగరాజు అని, తండ్రి పేరు సూరిబాబు అని, కొత్త గాజువాక లక్కీ షాపింగ్ మాల్ సమీపంలో నివాసం ఉంటున్నాడని కేజీహెచ్ వైద్యులు తెలిపారు. అతనికి సంబంధించిన వారు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో గానీ, 94409 04309 నంబర్‌కు ఫోన్ ద్వారా గానీ సంప్రదించాలని కోరారు.

దిశ యాప్‌తో ఆపద వేళ రక్షణ



మాట్లాడుతున్న గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: నేరాలు జరిగే సమయంలో విద్యార్థినులు, మహిళలు యుక్తితో వ్యవహరించాలని గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ సూచించారు. గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదం ఎదురైనప్పుడు ఆందోళనకు గురికాకుండా యుక్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి తమ ఫోన్లలో దిశ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద సంభవించినా, ప్రాణహాని ఉందని గ్రహించినా ఆ యాప్ ద్వారా క్షణాల్లో పోలీసుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇటీవల దిశయాప్ ద్వారా సురక్షితంగా బయటపడిన కొన్ని ఉదంతాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ శ్రీనివాసరావు, గాజువాక క్రైం హెచ్‌సీ వరహాలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పథకాలతో సంతోషంగా ఉన్నాం

ఎమ్మెల్యే నాగిరెడ్డితో లబ్ధిదారులు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో సంతోషంగా ఉన్నామని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే నాగిరెడ్డితో పేర్కొన్నారు. తమకు సకాలంలో పథకాలన్నీ అందుతున్నాయని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 67వ వార్డు అశోక్‌నగర్ సచివాలయం పరిధిలో లబ్ధిదారులను బుధవారం కలుసుకున్నారు. పథకాలు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులను అడగడంతో, తాము సంతోషంగా ఉన్నామని పలువురు బదులిచ్చారు. మరిన్ని పథకాలను పేదలకు అందించేందుకు జగనన్నకు మరోసారి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు రాజాన వెంకటరావు, పల్లా పెంటారావు, అచ్చంనాయుడు, రాజేష్, కిలారి సత్యనారాయణ, చిత్రాడ అప్పారావు, కామినాయుడు, పల్లా లక్ష్మి, అన్నపూర్ణ, రజిని తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగలు అరెస్ట్



రాజునాయుడు



నిషాంత్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఇద్దరు దొంగలను స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈ నెల మొదటి వారంలో ఉక్కునగరంలోని రెండు క్వార్టర్స్‌లో వరుసగా జరిగిన దొంగతనాల్లో రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ అయ్యాయి. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో లభించిన ఆధారాల మేరకు అచ్యుతాపురం మండలం దోసూరుకు చెందిన కొల్లి రాజునాయుడు (20), పరవాడ మండలం తానాంకు చెందిన బత్తి నిషాంత్‌లను క్రైం సీఐ సూర్యనారాయణ నేతృత్వంలో ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు అరెస్ట్ చేశారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరచగా, రిమాండ్ విధించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు నారమాల రమణ

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రీనగర్‌లోని గుడివాడ గురునాథ కాలనీ, కనకదుర్గ గుడి వద్ద నివాసం ఉంటున్న నారమాల రమణ (49) గతంలో స్క్రాప్ వ్యాపారం, తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. వ్యాపారం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆటోనగర్ డీ–బ్లాక్ పాత అన్న క్యాంటీన్ వద్ద గల ఆటోనగర్ పార్క్‌లోని మామిడితోటలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం వేకువజామున చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు, గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు.

699వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కాలినడకన తిరుమల వెళ్లొచ్చిన కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 699వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరంలో ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్ విభాగ కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలంటూ కూర్మన్నపాలెం నుంచి తిరుపతికి కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చిన ఉక్కు కార్మికులు సయనబాబు, గంటల రామారావును దీక్షా శిబిరం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, గుమ్మడి నరేంద్ర, డి. శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించేవరకు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో జి.జయ, జామినాయుడు, ఎస్.రమణ, బి.ఎస్.రాజు, ఎ.రాజేశ్వరరావు, రెడ్డి శ్రీనివాసరావు, వై.వి.రమణ, ఎన్నేటి రమణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ: సంకట మోచన గణపతి ఆలయ కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి, మంత్రి శంకరనారాయణ, కట్టా సతీష్, ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా కూడారై ఉత్సవం



స్వామికి పాయసం నివేదిస్తున్న అర్చకులు

ఉక్కునగరం: సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కూడారై ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ ఆధ్వర్యంలో 108 వెండి గిన్నెలలో అమ్మవారికి పాయసం నివేదించి, పాశుర విన్నపం చేశారు.

గోదాదేవికి పాశుర విన్నపం

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరాలయంలో కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఆండాళ్లమ్మ వారికి పాయస ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు.

వెంకన్నతిరువీధి ఉత్సవం



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఆలయంలో కూడారై ఉత్సవాన్ని జరిపించారు. శ్రీలక్ష్మి గణపతి బృందం కోలాటం ప్రదర్శించారు.ఆలయ కమిటీ చైర్మన్ ఈ.కె.చారి, సాయి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఎఫ్‌బీఎస్ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఫ్యామిలీ బెనిఫిట్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. బుధవారం జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ నుంచి బరిలో నిలిచిన వై.రాజన్న గెలుపొందగా, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ప్యానెల్ నుంచి బరిలో నిలిచిన జి.దేముడు విజయం సాధించారు. పోటీలో తలపడ్డ రెండు ప్యానెళ్ల నుంచి ఒక్కొక్కరు విజయం సాధించడంతో విజేతలిద్దరూ సొసైటీ అభివృద్ధి పనులను ఐక్యంగా నిర్వహించాల్సి ఉంది.

ఉక్కులో రహదారి భద్రతా వారోత్సవాలు



భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న జీఎం రాజేంద్రన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో బుధవారం రహదారి భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఉక్కునగరం డీపీఎస్ వద్ద భద్రతపై బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించి, రహదారి భద్రతా నియమాలపై నినాదాలు చేశారు. భద్రతా విభాగం జీఎం జె. రాజేంద్రన్ మాట్లాడుతూ బాల్యం నుంచి రహదారి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై నడిచేటప్పుడు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు, భారీ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని సూచించారు. నిబంధనలను సక్రమంగా ఆచరించడం ద్వారా ఉత్తమ పౌరులుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం ఎన్.వి. రంగారావు, సీనియర్ మేనేజర్ పి. కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.70లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.70 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయని తెలిపారు. బాలచెరువులో రోడ్లు, కాలువలు, నడుపూరు శెట్టిబలిజ వీధిలో కమ్యూనిటీ హాల్, నడుపూరు, ఎస్సీ కాలనీ, స్వతంత్రనగర్ హనుమాన్ టెంపుల్ వద్ద రోడ్లు కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే వార్డులో చేపట్టిన పనులు 70శాతం వరకు పూర్తయ్యాయన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని పనులు చేపట్టి, మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, మంత్రి రాజశేఖర్, తాటికొండ జగదీష్, పి. ప్రమీల, మంత్రి శంకరనారాయణ, నరసింహమూర్తి, అచ్యుత్, పత్రీ దేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తడి–పొడి చెత్తపై అవగాహన



చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి సచివాలయం–2లో ప్రజలకు తడి–పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారానికో రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమలకు చెక్ చెప్పవచ్చన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్, తడి–పొడి చెత్తను విభజించి ఇవ్వడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యూసర్ చార్జీలను ప్రతి ఒక్కరూ చెల్లించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రగామిగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, కార్పొరేటర్ బొండా జగన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, పబ్లిక్‌వర్క్స్ ఈఈ అప్పారావు, ఏఈ తులసి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిర్వాసితుల నిరాహార దీక్ష



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్ల నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసితుల ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో చేపట్టిన 36 గంటల నిరవధిక నిరాహార దీక్షల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు, సెయిల్, ఎన్ఎండీసీలను విలీనం చేస్తే ప్రపంచానికి కావాల్సిన ఉక్కును భారతదేశమే ఎగుమతి చేయగలదన్నారు. నిర్వాసితుల భూములతో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులకు న్యాయం జరగడానికి అవసరమైతే ఆమరణ దీక్షకు కూడా సిద్ధమే అన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కె.సత్యనారాయణరావు, పెదిరెడ్ల నీలకంఠం, కరణం సత్యారావు, బొబ్బరి సూరి, గళ్ల రామకృష్ణ, ప్రసాద్, పితాని బాలకృష్ణ, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, నెల్లి శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి కుమార్తె వైద్యానికి చేయూత



కార్మికునికి సాయం అందజేస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడు కుమార్తె వైద్యానికి కోక్‌ఓవెన్ విభాగం సీపీపీ సెక్షన్ కార్మికులు ఆర్థిక సాయం అందజేశారు. విభాగం కాంట్రాక్టు కార్మికుడు కోన చిన్నారావు పెద్ద కుమార్తె వేద విద్యశ్రీ తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. చిన్నారావు పరిస్థితి తెలిసిన సెక్షన్ కార్మికులు రూ. 1,15,516 విరాళంగా సేకరించి, విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విభాగం జీఎం వై.వి.ఆర్. శ్రీనివాసరావు, జీఎం శేషాచలాచారి చేతుల మీదుగా చిన్నారావుకు నగదు అందజేశారు. కార్యక్రమంలో విభాగం కార్మిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.